సాక్షి
మెదక్

శనివారం ၊ 18 ၊ అక్టోబర్ ၊ 2025



అప్రమత్తతతోనే ఆనందకేళి

దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకొందాం. బాణాసంచా కాల్చే వేళ అప్రమత్తంగా ఉందాం. వివరాలు IIలో ▸



రసమయి ఫాంహౌస్‌పై దాడి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవతో బెజ్జంకి మండలంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు IIలో ▸

బీసీ బంద్‌కు మద్దతు

నర్సాపూర్: బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. వారు విలేకరులతో వేర్వేరుగా మాట్లాడారు. బీసీలకు రాజ్యాంగ బద్ధంగా హక్కులు కల్పించడానికి, న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

న్యూస్‌రీల్

వన దుర్గమ్మ దర్శనాలు ప్రారంభం

62 రోజుల అనంతరం ఆలయ ప్రవేశం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ దర్శనం ఎట్టకేలకు 62 రోజుల అనంతరం శుక్రవారం ప్రారంభమైంది. రెండు నెలలుగా, ఆగస్టు 14 నుంచి మంజీరా నదికి వరదలు రావడంతో దుర్గమ్మ ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుపోయింది. మధ్యలో రెండు రోజుల దర్శనం ప్రారంభించినప్పటికీ, తిరిగి వరదలు రావడంతో ఆలయాన్ని మూసివేశారు. ఫలితంగా ఆలయానికి సుమారు రూ.1.50 కోట్ల నష్టం జరిగింది. ఇటీవల సింగూరు నుంచి వరద తగ్గడంతో ఆలయాన్ని శుభ్రం చేసి, భక్తుల దర్శనానికి అనుకూలంగా తీర్చిదిద్దారు. అర్చకులు దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందే

సీపీఎం డిమాండ్



మెదక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

మెదక్ కలెక్టరేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసు వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లేశం విలేకరులతో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ వ్యవహారంపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్ర బంద్ తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, నాయకులు కిరణ్, అజయ్, సత్యం, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

న్యాయమూర్తి శుభావల్లి



మాట్లాడుతున్న న్యాయమూర్తి

మెదక్‌జోన్: ఎట్టిపరిస్థితుల్లో మత్తుకు బానిస కావద్దని మెదక్ జిల్లా సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్ఎం శుభావల్లి సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, మత్తుపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ తీసుకునే వారి మానసిక స్థితి గురించి విద్యార్థులకు వివరించారు. ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యపానం వలన కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ డ్రగ్స్ నిర్మూలన కమిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రమణ కుమార్, ప్లాన్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ జే.వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ ఎల్.సిద్ధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రసాయన శాస్త్రం(1), కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ (1) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50శాతం మార్కులుంటే అర్హులని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీహెచ్‌డీ లేదా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్, స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఉత్తీర్ణులైన వారికి, అలాగే బోధనా అనుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థులు ఈనెల 22న సాయంత్రం 4గంటలలోపు కళాశాలలో నేరుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 23న కళాశాల ప్రాంగణంలో డెమో క్లాస్ తోపాటు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని రైతులు తమ పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో రైతులకు కాటన్ కపాస్ యాప్‌పై అవగాహన కల్పించారు. రైతులు తమ పత్తి పంటను అమ్ముకోవాలంటే ఈ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత అమ్ముకునే అవకాశం ఉందన్నారు.

దారుణాలు



ప్రభుత్వ రుణ కేటాయింపుల లక్ష్యాలను చేరటం లేదు. వార్షిక రుణాలను ప్రతీఏటా పెంచుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావటం లేదు. ఫలితం ఏనాడూ రుణ లక్ష్యం చేరిన దాఖలాలు లేవు

లక్ష్యం చేరని వార్షిక రుణం

- కేటాయింపులు కొండంతా.. ఇచ్చేది గోరంతా
- ఈ ఏడాది రూ.6,592 కోట్లు విడుదల
- ఇప్పటివరకు ఇచ్చింది రూ.1,414 కోట్లు
- అధికారుల సమన్వయలోపంతో అందని రుణాలు

మెదక్‌జోన్: రుణాల లక్ష్యం చేరుకోకపోవడానికి ప్రధాన కారణం అధికారుల మధ్య సమన్వయం లేకపోవటమేనని తెలుస్తోంది. ముఖ్యంగా రైతులు తీసుకోవాలనుకునే వ్యవసాయ సంబంధిత, వాటి అనుబంధ రుణాలు ఇవ్వటంలో సవాలక్ష ఆంక్షలు పెడుతూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. గత 2024–2025 ఏడాదిలో రూ.5,789 కోట్లు కేటాయించగా అందులో ఇచ్చింది మాత్రం రూ.4,476 కోట్లే. ఈ లెక్కన 75% ఇచ్చారు.

వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు!

రిజర్వుబ్యాంక్ నిబంధనల మేరకు ప్రతీఏటా 10% కేటాయింపులు పెంచుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆవిధంగా రుణాలు ఇవ్వటంలేదు. ఫలితంగా రైతులతో పాటు ఇతరులు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో అధిక వడ్డీకి వ్యాపారుల వద్ద రుణాలు తీసుకుని తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేటాయింపులకు అనుగుణంగా రుణసౌకర్యాలు కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉంది.

ఐదునెలల్లో ఇచ్చింది 20శాతమే!

ప్రతీ ఏటా వేసవిలోనేలో రుణకేటాయింపులు చేస్తారు. వానాకాలంలో వ్యవసాయ పెట్టుబడికోసం, వ్యవసాయేతర, దీర్ఘకాలిక రుణాలు, పరిశ్రమలు, విద్య, హౌసింగ్, మహిళా సంఘాలు తదితర అవసర నిమిత్తం ఈ ఏడాది రూ.6,592.59 కోట్లు కేటాయించారు. వాటిని కేటాయించి ఇప్పటికి ఐదు నెలలు కావొస్తోంది. కానీ, ఇప్పటివరకు రూ.1,414.30 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈ లెక్కన 20% కేటాయింపులు మాత్రమే పూర్తికాగా ఇంకా 80% రుణాలు ఇవ్వాల్సి ఉంది.

రుణాలు అందజేస్తాం

“ వార్షిక రుణప్రణాళిక ప్రకారం రుణాల పంపిణీకి కృషి చేస్తాం. ఏదేని బ్యాంకు మేనేజర్లు రుణాలు ఇవ్వటంలో ఇబ్బందులు పెడితే శాఖాపరమైనా చర్యలు తీసుకుంటాం. కేటాయింపులను లక్ష్యం మేరకు ఇస్తాం.

– బాపూజీ ,లీడ్‌బ్యాంక్ మేనేజర్, మెదక్

బోనస్ బొనాంజా

సన్నాలు కొనుగోళ్లు చేసిన 48 గంటల్లోనే చెల్లింపులు

- జిల్లాలో వానాకాలం సాగు లక్షా 464 ఎకరాలు
- దొడ్డురకం వడ్లకు మద్దతు ధర రూ.2,389కి పెంపు
- సన్నాలకు బోనస్‌తో కలిపి రూ.2,889

సన్నాలకు సర్కార్ బోనస్ బొనాంజా ప్రకటించింది. ధాన్యం కొనుగోళ్లు చేసిన 48 గంటల్లోనే కనీస మద్దతు ధరతో కలిపి బోనస్ కూడా చెల్లిస్తామని స్పష్టం చేసింది. ఈసారి దొడ్డు వడ్లకు మద్దతు ధర క్వింటాలుకు రూ.2,389కి పెరిగింది. ఈ లెక్కన బోనస్‌తో కలిపి సన్న వడ్లకు రూ.2,889 చెల్లించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఇదిలా ఉంటే గత యాసంగి బోనస్ బకాయిలూ కూడా చెల్లించాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు.

– మెదక్ అర్బన్

వానాకాలం సీజన్ సన్నాలకు అనుకూలం కావడం.. బోనస్ ధరపై ఆశతో రైతులు 1,00,464 ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేశారు. ముఖ్యంగా మంజీరా తీర ప్రాంతాలు, బోరు ఆధారిత వ్యవసాయం చేసే పాపన్నపేట, కొల్చారం, మెదక్ , హవేలిఘనపూర్, నర్సాపూర్, కొడిపల్లి, రామాయంపేట, నిజాంపేట, తూప్రాన్ తదితర మండలాలలో సన్న రకం వరి సాగు చేశారు. గతంలో దొడ్డు ధాన్యం మద్దతు ధర రూ.2,320 ఉండగా, ఈసారి రూ.2,389కి పెంచారు. ఈ లెక్కన చూస్తే సన్నాలకు బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.2,889 వస్తుంది. సాగు పరంగా పెట్టుబడి చూస్తే.. సన్న వడ్లకు ఎకరాకు రూ.25 వేలు, దొడ్డు రకం వడ్లకు రూ.20 వేలు అవుతుంది. అలాగే దిగుబడిని బేరీజు వేస్తే సన్నాలు 22 క్వింటాళ్లు, దొడ్డువి 25 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంది. బోనస్‌పై ఆశతో కొంత మంది సన్న వడ్లకు ప్రాధాన్యత ఇచ్చారు.



ఏపుగా పెరిగిన సన్నాలు

యాసంగి బోనస్ ఏదీ?

గత యాసంగి బోనస్ కు సంబంధించి ప్రభుత్వం ప్రకటన చేయక పోవడంతో అన్నదాతలో అనుమానాలు కలుగుతున్నాయి. అసలు ఈ యేడు బోనస్ మద్దతు ధరతో కలిపి 24 గంటల్లోనే చెల్లిస్తామని ప్రకటించినా, బోనస్ బకాయిల ఊసే లేక పోవడంతో ఆందోళన వ్యక్త మవుతోంది. గత యాసంగిలో 14,994 మంది రైతులు 62,747 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని విక్రయించారు. వీరికి బోనస్ రూపంలో రూ.31.37 కోట్లు రావాల్సి ఉంది. వీటి కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

చెల్లిస్తామనడం సంతోషం



వడ్లు తూకం చేసిన 48 గంటల్లోనే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం సంతోషం. ఈసారి భారీ వానలతో, పొంగి పొర్లిన వరదలతో అనేక చోట్ల పంటలు దెబ్బ తిన్నాయి. రైతులు అనేక విధాలుగా నష్టపోయారు. కనీసం బోనస్ డబ్బులు ఇస్తే సకాలంలో అప్పులు తీర్చగలం.

– పోచయ్య, రైతు పాపన్నపేట

బకాయిలూ చెల్లించండి



గత యాసంగికి సంబంధించి సన్న వడ్లకు బోనస్ ఇంత వరకు రాలేదు. సుమారు రూ.40 వేలు రావాలి. బకాయిల చెల్లింపుపై నిర్ణయం తీసుకోక పోవడం శోచనీయం. ప్రభుత్వాన్ని నమ్మి, బోనస్ ఆశకు చాలా మంది రైతులు సన్న వరి వేశారు. రైతులను ఇబ్బంది పెట్టడం తగదు.

– మహిపాల్, రైతు, పాపన్నపేట



మెదక్‌లో బస్‌డిపో ఎదుట రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛను హరించడమే..

- 'సాక్షి'పై ఏపీ సర్కార్ దాడులు హేయం
- కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- జర్నలిస్టుల డిమాండ్
- మెదక్‌లో ధర్నా, కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



మెదక్‌జోన్: నకిలీ మద్యంపై కథనాలు ప్రచురించిన సాక్షి విలేకరులతో పాటు ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం చర్యలను జర్నలిస్టులు ఖండించారు. ఈ దమనకాండను నిరసిస్తూ శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బస్‌డిపో సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఏపీలో సాక్షి పత్రికపై కక్ష గట్టి పత్రికా స్వేచ్ఛను హరిస్తూ రాజ్యాంగాన్ని కాలరాస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించడమంటే ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించినట్లేనని పేర్కొన్నారు. ఏపీలో సాక్షి టీవీ ప్రసారాలను ఆపటంపై సర్వోన్నత న్యాయస్థానం కూటమి ప్రభుత్వానికి చీవాట్లు పెట్టినా, సాక్షి ప్రధాన కార్యాలయంపై మూడు రోజులుగా దాడులు చేస్తూ సంపాదకుడికి నోటీసులు ఇవ్వటం, రాజ్యాంగ విరుద్ధమైనా ప్రశ్నలు సంధించటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దాడులు నిలిపివేసి, అకారణంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే యాజమాన్యాలకు అతీతంగా జర్నలిస్టుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, సాక్షి జిల్లా ఇన్‌చార్జి నీలయ్య, ఐ న్యూస్ బ్యూరో ఇన్‌చార్జి క్రాంతి, సీనియర్ పాత్రికేయులు నాగరాజు, గోపాల్‌గౌడ్, వెంకట్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్, లక్ష్మణ్, కృష్ణమూర్తి, మల్లేశం, ఊశయ్య, తదితరులు ఉన్నారు.

సాక్షిపై ఏపీ ప్రభుత్వం కుట్ర: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేల సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డిపై టీడీపీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులను పెట్టడం సరికాదని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఖండించారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కుట్రపూరితమైన చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

విద్యాసామర్థ్యాలు పెంచండి

- విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి
- ఎఫ్‌ఎల్‌ఎన్ పటిష్టంగా అమలు చేయాలి
- ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులదే బాధ్యత
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అమలులో ఆయా మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదే కీలక బాధ్యత అని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. హవేళి ఘణాపూర్ డైట్ కళాశాలలో శుక్రవారం ఎఫ్ఎల్ఎన్ అమలులో భాగంగా ఆయా మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ పటిష్టంగా అమలు చేసి విద్యార్థులు విద్యాసామర్థ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచి గుణాత్మక విద్యా బోధన ద్వారా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

పోషణ లోపం పిల్లలను గుర్తించాలి

మెదక్ కలెక్టరేట్: చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత డీడబ్ల్యుఓ సిబ్బందిపై ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆరోగ్యంపై తల్లి, బిడ్డలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణిలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తగిన ఆహారం, పోషకాహారం గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

పల్లెప్రగతి ఎలా..?

కొత్త ఎంపీడీఓల ఆరా

ఉపాధి, గ్రామాభివృద్ధి పనుల పరిశీలన



చిన్నశివునూర్‌లో పర్యటించిన ఎంపీడీఓలు

చేగుంట(తూప్రాన్): ఇటీవల గ్రూప్ పరీక్షల్లో ఉద్యోగం పొందిన ఎంపీడీఓలు క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా శుక్రవారం చేగుంట మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల పరిషత్‌ల ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనులతో పాటు గ్రామాభివృద్ధి విషయాల గురించి తెలుసుకున్నారు. ఉపాధి హామీ ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం, వ్యవసాయ సంబంధిత పనులు, రోడ్ల నిర్మాణం, నర్సరీల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. సీనియర్ ఫ్యాకల్టీ అనిల్‌కుమార్ వివిధ పనులపై వారికి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల ద్వారా నిర్వహించే గ్రామాభివృద్ధి కార్యక్రమాలను గురించి చిన్న శివునూర్ గ్రామంలో పరిశీలన జరిపారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరుతున్న ఎంపీడీఓలకు జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావులు గ్రామాల్లో అభివృద్ధిలో ఎంపీడీఓల బాధ్యతల గురించి తెలియజేశారు.

క్రీడలతో స్నేహభావం: డీఎం సురేఖ

- జిల్లాస్థాయి బాలికల ఖోఖో పోటీలు ప్రారంభం
- విజేతలకు బహుమతులు అందజేసిన డీఎం సురేఖ



మెదక్‌లో బాలికల ఖోఖో పోటీలు

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లాస్థాయి అండర్ 17, అండర్ 14 బాలికల ఖోఖో పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జిల్లాస్థాయి పోటీల్లో 21 మండలాల నుంచి 420 మంది బాలికలు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందించుకోవచ్చన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో హవేళీఘనాపూర్ జట్టు మొదటి బహుమతి, , పాపన్నపేట ద్వితీయ బహుమతి, రామాయంపేట తృతీయ బహుమతి అండర్–14విభాగంలో ఫస్ట్ ప్రైజ్ పాపన్నపేట, సెకండ్ ప్రైజ్ మెదక్, థర్డ్‌ప్రైజ్ చేగుంట జట్లు సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు ఈనెల చివరి వారంలో మెదక్‌లో జరిగే ఉమ్మడి మెదక్ జిల్లా ఖో ఖో పోటీలలో పాల్గొంటాయని తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య

నర్సాపూర్ రూరల్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య రైతులకు సూచించారు. నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంటలో గాలికుంటు నివారణ టీకాల శిబిరంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పశు వైద్య సిబ్బంది ప్రతీ గ్రామానికి వెళ్లి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లకే అడ్డంకులెందుకు?



బంద్‌కు సంఘీభావం తెలుపుతున్న బీసీ నేతలు

- నేటి బంద్‌ను విజయవంతం చేద్దాం
- బీసీ సంఘం నేత సురేందర్‌గౌడ్

మెదక్‌జోన్: ఎకనామికల్ వీకర్ సెక్షన్స్(ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లకు లేని అడ్డంకులు బీసీ రిజర్వేషన్లకే ఎందుకు అని బీసీ నేత కొండన్ సురేందర్‌గౌడ్ ప్రశ్నించారు. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ ఫలాలు అందాలనే డిమాండ్‌తో తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో వివిధ బీసీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయంగా ఏళ్లతరబడి అన్యాయానికి గురవుతున్న బీసీలందరూ పోరాటం సాగించాలని అన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు చింతల నర్సింహులు, శంకర్ గౌడ్, మామిళ్ల అంజనేయులు, రామస్వామి, కృష్ణ, మంగ మోహన్ గౌడ్, ఎండీ హఫీజ్, గౌస్ ఖురేషి, మానవ హక్కుల వేదిక నేత షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఖరి మారాలి

- కార్మికులు, ఉద్యోగుల రంగంపై విధానాలు మార్చుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

మెదక్ కలెక్టరేట్: కార్మికులు, ఉద్యోగుల రంగాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మార్చుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో జిల్లా సెమినార్ నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ అధ్యక్షతన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు – ఉద్యోగులు, కార్మికులపై ప్రభావం అనే అంశంపై సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా ఉద్యోగులు, కార్మికులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలబడిన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలలోకి విదేశీ ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారని మండిపడ్డారు. పోస్టల్, టెలికంలోనూ ఇదే స్థితిలో కొనసాగుతుందని చెప్పారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ, సంతోష్, జిల్లా కోశాధికారి నర్సమ్మ, అడివయ్య, మల్లేశం, అజయ్, యాదగిరి, దుర్గ, కవిత, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్ట్‌ అండ్‌ క్రాఫ్ట్‌లో ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వన్‌స్టెప్‌ ఫ్యాషన్‌ డిజైనింగ్‌ ఆధ్వర్యంలో ఆర్ట్‌ అండ్‌ క్రాఫ్ట్‌పై ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఇనిస్టిట్యూట్‌ డైరెక్టర్‌ హారిక, రవీందర్‌ శుక్రవారం తెలిపారు. గ్లాస్‌ , ఫ్యాబ్రిక్‌ పెయింటింగ్‌, టై అండ్‌ డై, పాట్‌ పెయింటింగ్‌ , మధుబని ఆర్ట్స్‌, క్యాన్వాస్‌ పెయింటింగ్‌, రివర్స్‌ ఆర్ట్‌, ట్రక్‌ ఆర్ట్‌పై ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు అందించనున్నారు. ఆసక్తి కల్గిన వారు 90109 40078కు ఫోన్‌ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



స్వప్నను అభినందిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్‌: 69వ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీలకు విద్యార్థిని ఎంపికైందని రాయపోల్‌ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రాంసాగర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని పి.స్వప్నను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లో జరిగిన జోనల్‌ స్థాయి వాలీబాల్‌ టోర్నమెంట్‌లో అండర్‌ -14 విభాగంలో విద్యార్థి ఎంపికావడం సంతోషంగా ఉందన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో 11 మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ఈ ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 11 మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

పుల్‌కల్‌(అందోల్‌): సింగూరు ప్రాజెక్టులో మత్స్యకారుడు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా... మండల పరిధిలోని సింగూరు గ్రామానికి చెందిన దాసరి కుమార్‌ (35) శుక్రవారం ఉదయం తోటి మత్స్యకారులతో కలిసి ప్రాజెక్టులోకి చేపల వేటకు వెళ్లాడు. తెప్పపైనుంచి ప్రమాదవశాత్తు నీటిలోకి పడిపోయాడు. తోటి మత్స్యకారులు గమనించి డ్యాంలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఇక్రిసాట్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాగుపై మహిళా రైతులకు అవగాహన

చేగుంట(తూప్రాన్‌): మండలంలోని పలు గ్రామాల మహిళా రైతులు సెహగల్‌ ఫౌండేషన్‌ హైటెక్‌ సీడ్స్‌ ప్రతినిధుల సౌజన్యంతో శుక్రవారం ఇక్రిసాట్‌ సందర్శనకు వెళ్లారు. పరిశోధనాలయంలో వారికి పెరటి తోటల పెంపకం, డ్రమ్‌ సీడర్‌, వరి పంట, డ్రిప్‌ ద్వారా పంటలు సాగు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. భూమి చదును, వర్మీకంపోస్టు తయారీ, పంటలను ఆశించే క్రిమి కీటకాలు, వాటి నివారణ చర్యల గురించి ప్రయోగశాలలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెహగల్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు నీరజ్‌ కుమార్‌, అవినాష్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్లు విజయ్‌, శ్రవణ్‌, బాబు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఆనందకేళి

- బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- సూచిస్తున్న నిపుణులు
- పిల్లలు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండాలి



సంగారెడ్డి క్రైమ్‌: దీపావళి పండుగలో పెద్దల కంటే పిల్లల సందడే ఎక్కువ. బాణాసంచా పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. టపాకాయలు కాల్చే సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చిన్నపాటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో కంటి చూపు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముఖ్యంగా గ్యాస్‌ సిలిండర్లు మండే పదార్థాలు టపాకాయలకు దూరంగా ఉంచాలి.
- ఇంట్లో, మేడపై కాల్చడానికి ప్రయత్నించవద్దు. బహిరంగ ప్రదేశాలు, ఆరు బయట మాత్రమే కాల్చాలి.
- ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా వెంటనే మంటలను అదుపు చేసేందుకు బకెట్‌లతో నిండుగా నీళ్లను పక్కన పెట్టుకోండి.
- నిప్పు రవ్వలు దుస్తులపై పడితే అవి త్వరగా వ్యాపించకుండా ఉండేందుకు పిల్లలతో పాటు పెద్దలు కాటన్‌ దుస్తులని ధరించాలి.
- గాయాలైనప్పుడు సెప్టిక్‌ కాకుండా నిరోధించేందుకు బర్నల్‌ లేదా దూది అయోడిన్‌ తదితర కూడిన ఫస్ట్‌ ఎయిడ్‌ కిట్టు అందుబాటులో ఉంచుకోవాలి.
- పిల్లలు కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండటం అత్యంత శ్రేయస్కరం.

ఇవి తప్పనిసరి

- టపాకాయలను ఒకసారి అంటించిన తర్వాత వెలగలేదని చూసేందుకు దగ్గరకు వెళ్లవద్దు. ప్రమాదవశాత్తు కొన్నిసార్లు పేలే ప్రమాదం ఉంటుంది.
- ఏమాత్రం జాగ్రత్తగా ఉన్న నిప్పు రవ్వలు పూరి గుడిసెలు, గడ్డివాములపైకి దూసుకెళ్లి అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి.
- చుడీదార్‌ వేసుకునేవారు వదులుగా ఉన్నవి కాకుండా బిగుతుగా ఉండేవి వేసుకోవాలి.
- పర్యావరణ హితమైన టపాకాయలు (గ్రీన్‌) వాడితే మంచిది.

జాగ్రత్తలు పాటించాలి



చిన్నపిల్లలకు టపాకాయలు అందకుండా, సిలిండర్‌కు దూరంగా ఉంచడం మంచిది. చేతులతో పట్టుకొని పేల్చటం ప్రమాదకరం. భారీగా కాల్చటం వల్ల పొగతో శ్వాసకోశ సమస్యలు, వినికిడి ఇబ్బందులు వస్తాయి. శరీరానికి మంటలు అంటుకుంటే అదుపు చేసి, కాలిన గాయాలను నీళ్లతో శుభ్రం చేయాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

– ఉష డాక్టర్‌, సంగారెడ్డి

అజాగ్రత్త వద్దు



టపాకాయలు కాల్చేటప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ వహించొద్దు. ముఖ్యంగా పిల్లలు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. ప్రమాదాల బారిన పడకుండా ఆనందంగా పండుగను జరుపుకోవాలి.

– బి.నాగేశ్వరరావు, అగ్నిమాపక అధికారి

ఫైర్‌ సేఫ్టీ నిబంధనలు పాటించాలి

ఎస్పీ పరితోష్‌ పంకజ్‌



సంగారెడ్డి జోన్‌: దీపావళి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసే టపాకాయల దుకాణదారులు ఫైర్‌ సేఫ్టీ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ పరితోష్‌ పంకజ్‌ ఓ ప్రకటనలో తెలిపారు. జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత సబ్‌-డివిజన్‌ పోలీసు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎవరైనా పోలీసుల నుంచి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే ఎక్స్‌ ప్లోజివ్‌ యాక్టు 1884 ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దుకాణాదారులు పాటించాల్సిన నిబంధనలు

- దుకాణాలు జనావాసాలకు దూరంగా, ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి.
- దుకాణం ఉన్న ప్రదేశానికి స్థల యజమాని నుంచి ఎన్‌ఓసి సర్టిఫికెట్‌ పొంది ఉండాలి.
- దుకాణాల మధ్య వ్యత్యాసం 3 మీటర్లు, గృహ నిర్మాణాలకు 50 మీటర్ల దూరంలో ఉండాలి.
- జనాలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎలాంటి టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదు.
- ఫైర్‌ ఆక్సిడెంట్‌కు సంబంధించి తక్షణం స్పందించే విధంగా ఫైర్‌ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య



మాణయ్య

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మక్తభూపతిపూర్‌ గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన బక్కన్నగారి మాణయ్య(47) పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు బతుకు దెరువు నిమిత్తం వెళ్లారు. కాగా స్వగ్రామానికి వెళ్తానని చెప్పి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



సాయికుమార్‌

తూప్రాన్‌: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జెండావల్లి సమీపంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుకు ముగ్గురు కూతుళ్లు. మగ సంతానం లేకపోవడంతో పెద్ద కూతురుకు ఇల్లరికం అల్లుడిని తెచ్చుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌలాపూర్‌ గ్రామానికి చెందిన పెద్దగొల్ల సాయికుమార్‌ (20)ను ఆరు నెలల క్రితం ఇంటికి తీసుకువచ్చాడు. కాగా ఈ నెల 15న అతడు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో నాగరాజు అతడ్ని మందలించాడు. ఆ రోజు రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన సాయికుమార్‌ తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. వెంటనే శివ్వంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హల్దీవాగులో శవమై తేలాడు.

ఉద్యోగం పేరుతో సైబర్‌ మోసం

రూ.12,500 పోగొట్టుకున్న వివాహిత

జహీరాబాద్‌: వివాహిత సైబర్‌ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి నగదు పోగొట్టుకుంది. బాధితురాలి కథనం ప్రకారం... నారాయణఖేడ్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఇన్‌స్టాగామ్‌లో రీల్స్‌ చూడగా రైల్వే ఉద్యోగం కోసం సంప్రదించాలని ఉండటంతో అందులో ఉన్న నంబర్‌కు ఈనెల 15న కాల్‌ చేసింది. ముందుగా ఐడీ కార్డు కోసం రూ.800 చెల్లించాలని సైబర్‌ నేరగాడు చెప్పగా ఆమె ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించింది.అలాగే వెరిఫికేషన్‌ కోసం రూ.7,250, కార్డు రావాలంటే మరో రూ.5,250 చెల్లించాలని చెప్పగా డబ్బులు పంపించింది. వెరిఫికేషన్‌ కావడం లేదని, మరో రూ.5వేలు పంపించాలని సైబర్‌ నేరగాడు చెప్పాడు. దీంతో మీరు ఎక్కడ ఉంటారని బాధితురాలు ప్రశ్నించగా తాను జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌లో ఉద్యోగం చేస్తానని సమాధానం ఇచ్చాడు. దీంతో బాధితురాలు తన తాత వినాయక్‌రావును వెంట బెట్టుకుని శుక్రవారం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. స్టేషన్‌ మేనేజర్‌ను సంప్రదించగా విషయం వెలుగు చూసింది. దీంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మా భూముల జోలికొస్తే ఊరుకోం



కబ్జాకు యత్నిస్తున్న స్థలంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు, గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలోని కట్కూర్‌ గ్రామంలో దళితుల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలోని దోమ రాజిరెడ్డి ఇంటి నుంచి దుబ్బతండా గ్రామానికి వెళ్లే దారి వరకు సుమారుగా 1.20 గుంటల భూమి ఉందన్నారు. ఈ భూమిని సహకార సంఘం వరి ధాన్యం కొనుగోలు పేరిట కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి రాంచంద్రారెడ్డి మృతదేహం

- నేడు తీగలకుంటపల్లిలో అంత్యక్రియలు
- గత నెల 22న ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌



కట్టా రాంచంద్రారెడ్డి

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): గత నెల 22న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్‌ నేత కట్టా రాంచంద్రారెడ్డి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శనివారం ఉదయం కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి తీసుకురానున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాంచంద్రారెడ్డి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన కుమారుడు రాజాచంద్‌ ఛత్తీస్‌గఢ్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశాడు. తన తండ్రిని మందుగానే అరెస్ట్‌ చేసి పోలీసుల కస్టడీలో ఉన్న సమయంలోనే ఎన్‌కౌంటర్‌ చేశారని ఆయన ఆరోపిస్తూ దీనిపై సిట్‌ ఏర్పాటు చేయాలని కోరాడు. దీంతో విచారణ పూర్తయ్యే వరకు మృతదేహం దహనం చేయకుండా భద్రపరచాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం కేసును డిస్మిస్‌ చేసింది. దీంతో శనివారం ఉదయం రాంచంద్రారెడ్డి మృతదేహం స్వగ్రామానికి రానుంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

- ఇద్దరు కూలీల దుర్మరణం
- సిద్దిపేట జిల్లాలో ఘటన



సాయిలు



రాజమల్లు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్‌

ములుగు(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన ములుగు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ కథనం ప్రకారం... మండలంలోని కమలాబాద్‌ గ్రామానికి చెందిన బోయిని సాయిలు(65), మర్కూక్‌ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన లెంకల రాజమల్లు(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే ములుగు రెవెన్యూ కార్యాలయ సమీంపలో రాజీవ్‌రహదారి డివైడర్‌పై గడ్డిని కత్తిరించే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యంగా, అతివేగంగా వచ్చి కూలీలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో కూలీలు సాయిలు, రాజమల్లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జయి రోడ్డుకు అతుక్కుపోయాయి. ఈ మేరకు ఆర్టీసీ డ్రైవర్‌ మహ్మద్‌రఫీపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టమ్‌ నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకుంది. కమలాబాద్‌కు చెందిన మృతుడు సాయిలుకు భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మరో మృతుడు రాజమల్లుకు భార్య అనసూయ, కూతురు, కుమారుడు ఉన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి..

రూ.1.50 లక్షలు చోరీ



కారు వద్ద ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

కంది(సంగారెడ్డి): కారులో ఉన్న నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన కాశీపూర్‌ శివారులో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్‌ ఎస్‌ఐ విజయ్‌ కుమార్‌ కథనం ప్రకారం... పటాన్‌ చెరు మండలం బీరంగూడకు చెందిన పిల్లిబోయిన శ్రవణ్‌ కుమార్‌ తన కారులో రూ.లక్షా 50 వేలు ఉంచి రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలోకి వెళ్లాడు. కార్యాలయంలో పని ముగించుకుని సాయంత్రం 3:30 గంటల సమయంలో తిరిగి వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగులగొట్టి డబ్బుల బ్యాగును అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్‌ సీఐ క్రాంతికుమార్‌, టౌన్‌ సీఐ రమేశ్‌ ఆధ్వర్యంలో క్లూస్‌ టీంతో ఆధారాలు సేకరించారు.

నిందితుడికి 20 ఏళ్ల జైలు

దబ్బాకరూరల్‌: మహిళపై లైంగికదాడి చేసిన ఘటనలో సిద్దిపేట జిల్లా ఫస్ట్‌ అడిషనల్‌, సెషన్స్‌ కోర్టు నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది. సిద్దిపేట సీపీ విజయ్‌ కుమార్‌ వివరాల ప్రకారం... 2018లో చిన్నకోడూరు మండలం, మల్యాల గ్రామానికి చెందిన దరిపల్లి విఠల్‌(52) దుబ్బాక మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై లైంగికదాడి చేశాడు. అప్పట్లో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు అనంతరం నేరస్తునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.5వేలు జరిమానా విధించింది. నేరస్తునికి శిక్ష పడేటట్లు కృషి చేసిన సీఐలు పరశురాములు, కృష్ణ, శ్రీనివాస్‌, ఎస్‌ఐ కీర్తి రాజు, సిబ్బందిని సీపీ అభినందించారు.

సర్వశిక్ష అభియాన్‌ ఉద్యోగుల నిరసన

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): రెండు నెలలుగా గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం చర్యలు తీసుకొని వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్‌ఎస్‌ఏ (సర్వ శిక్ష అభియాన్‌) ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు శుక్రవారం ఉదయం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమయానికి వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రవి, మానిక్‌, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

విద్యార్థి మృతిపై ఎస్సీ కమిషన్‌ విచారణ

వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్‌ డైరెక్టర్‌ సునీల్‌కుమార్‌ బాబు

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలోని పోతారం(ఎస్‌)లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 7న 8వ తరగతి విద్యార్థి వివేక్‌ అనుమానాస్పదంగా మరణించాడు. శుక్రవారం జాతీయ ఎస్సీ కమిషన్‌ డైరెక్టర్‌ జి.సునీల్‌కుమార్‌ బాబుతో పాటు కలెక్టర్‌ హైమావతి, సీపీ విజయ్‌కుమార్‌ పాఠశాలకు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పాఠశాలలో ఆ రోజు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? అక్కడ ఉపాధ్యాయులు ఎవరెవరు ఉన్నారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ప్రిన్సిపాల్‌ను విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ, సీఐలను కేసు విచారణ గురించి ప్రశ్నించారు. విద్యార్థికి పోస్టుమార్టం చేసిన డాక్టర్లను పిలిపించి మృతదేహంపై గాయాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసు దర్యాప్తు నెలలో పూర్తి అవుతుందని, వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు వివరించారు. వీరివెంట అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్‌ లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ రమేశ్‌ ఉన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): కుక్కల దాడిలో ఓ లేగదూడ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మోత్కులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మడక తిరుపతికి రెండున్నరేళ్ల ఆవుదూడ కుక్కల దాడిలో మరణించింది. దీని విలువ సుమారుగా రూ.40వేల వరకు ఉంటుందని పలువురు రైతులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, పిల్లలు, వృద్ధులు, పశువులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



మృతి చెందిన లేగదూడ వద్ద రోదిస్తున్న రైతు తిరుపతి

స్కూటీపై వచ్చి.. చైన్‌ స్నాచింగ్‌

సిద్దిపేటకమాన్‌: యువతి మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్‌ పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన డి.భవిత (22) రోజులాగే శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వెనక నుంచి స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు యువతి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

విద్యార్థిని అదృశ్యం

కొండపాక(గజ్వేల్‌): విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన కుకునూరుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోడపట్ల పోశయ్య కూతురుకు ఇంటర్మీడియెట్‌ అనంతరం బాసరలోని ట్రిపుల్‌ ఐటీలో సీటు వచ్చింది. కానీ వెళ్లకుండా ఇంటివద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈనెల 16న రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేసి పడుకుంది. మరుసటి రోజు తెల్లవారుజామున చూసే సరికి కనిపించలేదు. దీంతో కుటుంబీకులు చుట్టు ప్రక్కల, బంధువులకు సమాచారం అందించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడి

- దిష్టిబొమ్మ దహనం, స్వల్ప ఉద్రిక్తత
- పీఎస్‌లో ఫిర్యాదు చేసుకున్న ఇరు పార్టీల నాయకులు



రసమయి ఫాంహౌస్‌ వద్ద కాంగ్రెస్‌ నాయకులను అరెస్ట్‌ చేస్తున్న పోలీసులు



దాడిలో పగిలిపోయిన ఫాంహౌస్‌ కిటికీ అద్దాలు

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకుల గొడవతో మండలంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదనపు డీసీపీ విశాల్‌ కుషాల్కర్‌ బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిస్థితులు పరిశీలించారు. మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అనుచిత వ్యాఖ్యలు చేశాడని కాంగ్రెస్‌ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుండారంలో గల రసమయి ఫాంహౌస్‌ ముట్టడికి యత్నించారు. కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయగా అద్దాలు పగిలాయి. ఫామ్‌హౌస్‌ వద్ద ఏసీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఫాంహౌస్‌ వద్దకు వచ్చిన బెజ్జంకి, ఇల్లంతకుంట, గన్నేరువరం మండలాల కాంగ్రెస్‌ నాయకులను అరెస్ట్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఉన్న కాంగ్రెస్‌ నాయకులను ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు బెజ్జంకిలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ దిష్టిబొమ్మను దహనం చేయగా, బీఆర్‌ఎస్‌ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యేను దూషించిన మాజీ ఎమ్మెల్యే రసమయిపై చర్యలు తీసుకోవాలని అదనపు డీసీపీ విశాల్‌ కుషాల్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు శ్రీను, ఉపేందర్‌, ఎస్‌ఐలు సౌజన్య, రాజేశ్‌, అలీ, పోలీసు, సీఆర్‌పీఎఫ్‌ జవాన్‌లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.